
# పోల్చుకోగల రాతే!



ఇది నా బతుకు పుస్తకమే! కానీ, చిత్రం- నేనే ఇంత అప్రధానమైన పాత్రనై పోయాను.

"అడిగితే రూపాయివ్వలేరు కానీ, సవాలక్ష నీతులు చెప్తారు". నేను కొయ్యబొమ్మనై పోతున్నాను. నా చేతులు కూడా వణకటం లేదు. మాట ఎటూ పెగలిరావటం మానేసింది.

"అదేమంటే మా తరంలో... అంటూ పనికిమాలిన కబుర్లూ..."

మనవరాలు ఉషారాణి. తాతని తోటకూర కాడలో పురుగుని విదిలించినట్లు విదిలిస్తోంది. పేజీ గుండె మీద బరబరా గీకేస్తోంది.

ఆమెకి పాకెట్ మనీ కావాలి. నా జేబు ఖాళీ. చేతులు ఖాళీ.

"అంతేనా అయితే... ఇవ్వరా?" గద్దింపు. పేజీ నిండా ప్రశ్నార్థకపు గుర్తులే వేసుకుపోతోంది.

అతి కష్టంమీద మాటలు కూడదీసుకున్నాను, "నా దగ్గర డబ్బులెక్కడివమ్మా. నువ్వూ చూస్తున్నావ్‌గా పరిస్థితులు..." తలెత్తి చూశానామెని. కడుపులో దేవినట్లయింది. ఆవేశాన్ని అదుపులో ఉంచుకుని సౌమ్యంగానే అన్నాను, "ఇలాంటి టైట్ డ్రెస్‌లెందుకమ్మా మనకు!"

"హుఁ" అని ఒక నిరసన ప్రకటన. "ఇదొకటీ మళ్లీ. ఎప్పుడూ కామెంట్లే" కళ్లల్లో ఏవగింపు. హ్యాండ్‌బ్యాగ్ ఊపుకుంటూ భుజాలెగరేసింది. కాళ్లు తాటిస్తూ "ఎప్పుడూ నా డ్రెస్ మీదా, తిండి మీదా, చదువుమీదా కామెంట్లే. పనీపాటా ఉండదు" నాలుగు దులిపి, రెండు అంగల్లో విసురుగా వెళ్లిపోయింది.

ప్రత్యేకించి ఉషారాణి అనేముంది?!

'పెద్దవాళ్లు పెద్దవాళ్లుగా ఉంటే బాగుంటుంది". వాళ్లమ్మ వనజ లోపల్నుంచీ అందుకుంది. "దాని ఫ్రెండ్సంతా అవ్వే వేసుకొస్తుంటే తను తాతలనాటి డ్రెస్‌లో వెళ్తే నామోషీగా ఉండదూ?"

నా పొరపాటుకి తగిన మాటపోటు! కాని పనులకి పోతే ఇంతే మరి! పదే పదే చెప్పుకుంటున్న 'బుద్ధి'ని మరోమారు నాకు నేనే చెప్పుకున్నాను.

ఈ పేజీల కథ ఎప్పుడూ ఇంతే. మళ్లీ మళ్లీ గతం తవ్వి తవ్వి అక్షరాలకెత్తుతాయి! అసలీ పేజీల్లో ఇన్ని వంకర గీతలు ఎప్పుడు మొదలయ్యాయో ఆలోచిస్తే, ఆశ్చర్యమేస్తుంది.

గుడ్డ దీపంముందు చదువులోనే ఆశలూ, కలలూ, కోరికలూ అన్నీ మసిబారిపోయాయి. ఆ మసి- పేజీలకీ అంటుకుపోయింది. దయాధర్మ భిక్షంగా అక్కడా ఇక్కడా వో పావలా తెచ్చుకుని, ఫీజు కట్టుకోవటమే నాన్న చెప్పిన చదువూ; గీసిన గీతా; రాసిన రాతా! గిజిగాడిలా దేనికన్నా వెంటపడితే, అటక మీది సంపదలోని చింతబరికె తన ప్రతాపం చూపేది. అందుకనే, ఆ కాలంలో ఒక పేజీ మీద - 'నోరా వీపుకు తేకే!' అని హెచ్చరికని రాసిపెట్టేసుకున్నాను. అదీ చాలా పెద్దక్షరాల్లో! అదో అనుబంధ గ్రంథం. పెద్దబాల'శిక్ష'!

చాలా పేజీలు గబగబా తిరిగిన్నై.

నేనుగా మహా మొనగాడిలా ఏదన్నా చెప్పబోయినా, "నీకేం తెలీదులే నువ్వుండు" పాఠం మొదలెట్టేవాడు నాన్న. నలభై ఏళ్ల క్రితమే తన అధ్యాయానికి చుక్కపెట్టేసుకున్నాడు. ఆ తర్వాత అన్నయ్య కూడా అంతే. నాన్న పాఠాన్నే కంఠతా పట్టాడు. ఆ తెలుగు మాష్టారికెప్పుడూ కంఠస్థం చేయవలసిన పద్యాల మీద శ్రద్ధా, భక్తీ మరి! ఆయన మరీ చిన్న పుస్తకం. త్వరగానే పూర్తయిపోయింది. ఆయన అంత త్వరపడి ముగింపు పెట్టుకున్నందుకు నేను నిజంగా చాలా రోజులు ఏడ్చాను.

అసలు మరీ అంత వెనక్కి వెనక్కి తొలి పుటల్లోకి పోవటం ఎందుకు గానీ, నా భార్య పరిమళ సంగతే చూడండి.

"అది తెలుసుగా. నేను పంపకాలకిచ్చేశానుగా. పాలూ, టీవీ, పేపరూ... నా బొందా..." వేష్టపడ్డాడు. దినపత్రికని నా చేతిలోనుంచీ లాక్కుని విసురుగా లోపలికి కదిలాడు. వెళ్తూ వెళ్తూ చిరాగ్గా "నా చావు నన్ను చావనీకుండా, ఈయన లోనొకటి. నా ప్రాణం తీస్తున్నాడీయన" అంటూ ఒక నిరసన చూపుతో వెళ్లిపోయాడు. వీడెప్పుడూ పేజీ మూలల్నీ, అంచుల్నీ కొరుక్కు తింటాడు.

నా కళ్లల్లో నీళ్లు ఉబికిన్నై.

నా'లోనా' అది? వచ్చే జీతం అద్దెకేపోతోందని మొగుడూ పెళ్లాం ఏడ్చి మొత్తుకుని కదా ఆనాడీ అప్పు చేయించింది? మీ వలన ఈ చేరెడు కొంపా ఒనకూడిందని వాళ్లల్లోవాళ్లు చెప్పుకుంటున్నా సంతోషమే కలిగింది. ఇవ్వాళ ఈ అక్షింతలు నాకా? ప్రతీ నెలా ఈ రాత సాగాల్సిందే. వనజ అయితే మరీను. తరాలనాటి ఘటనలు తవ్విపోస్తూ ఒంటికాలిమీద లేస్తుంది. నా పుస్తకంలో ఏ పేజీ అయినా పనికి రానిదే అని పదే పదే నిరూపించటానికే ఆమె తన చాకచక్యాన్నంతా ప్రయోగిస్తుంది.

అసలు నేను చంద్రంని డాక్టర్‌గా చూసుకోవాలనుకున్నాను "ఎంసెట్లూ, ఐసెట్లూ, గట్లూ అక్కర్లేదు. నాకు బుర్రతక్కువని ఎటూ మీరంతా తేల్చేశారుగదా! అన్నాడు. "తక్కువ నోములు నోచి ఎక్కువ ఫలాలు కావాలంటే వస్తాయా?" అని వో ప్రశ్నార్థకం పెట్టేసి పేజీ తిప్పేసింది పరిమళ. బీకామ్ అయిందనిపించి, ఏదో ప్రైవేట్ కంపెనీలో గొర్రె తోక జీతంలో చేరాడు. ఆ తర్వాత ఒక గ్రీష్మంలో- మధ్యాహ్నం- వనజని వెంటపెట్టుకొచ్చాడు. "పెళ్లి చేసుకున్నాను. మా కంపెనీలో స్టెనో కూతురు"అని ఓ గంట తర్వాత "వేరే కులం వాళ్లది. అయినా కులాన్ని కొరుక్కు తింటామా?" అని లాజిక్‌లోకి పోయాడు.

కొత్త ప్రకరణం మొదట్లోనే "ఇవన్నీ మీకెందుకు లెండి. నే జూసుకుంటాగా"అని ఫుట్ నోట్ కింద ఉంచేసింది నన్ను. అన్ని సమస్యలకీ ఇంక అదే మొదలూ, అదే ముగింపూ! పొరపాటున ఎక్కడన్నా నేను మెయిన్ లైన్లోకి చేరదామని ప్రయత్నం చేసినా, తానో హంస పాదు పెట్టి కొట్టేసేది. "అయినా ఇందులో మీరు చెప్పాల్సిందేం ఉందండీ నేనున్నాగా. మీకెందుకీ శ్రమ. నాకొదిలెయ్యండి" వంటి ఏ సమాసమూ లేని సాధారణ పేరాలు రాసేసేది!

"లోన్ ఈయెమ్మైకి నోటీసొచ్చిందివాళ" కొడుకు చంద్రం. పుస్తకం మూసి తలెత్తి అతనివైపు సాలోచనగా చూశాను.

"డబ్బేమైనా ఉంటే..." అని అంతే సాలోచనతో అన్నాడు.

"అదేమిట్రా. పెన్షన్ మొత్తం తీసుకురాగానే వారం క్రితమే ఇచ్చేశానుగా" మాటలు తెమల్చుకుని అన్నాను.

**- విహారి**

★ భాగోత్తర గుటికా రెండు మాత్రలు రోజుకు మూడుసార్లు తీసుకుంటే ఆస్మా తగ్గుతుంది.

నాలుగు గంటల దాకా నెత్తీనోరూ కొట్టుకుని, కన్నీళ్ల వాన కురిపించిన పరిమళ, ఆ తర్వాత చాలా బిజీ అయిపోయింది. నానా హడావిడీ చేసి- రాత్రికి- కొడుకునీ కోడల్నీ పడకటింట్లోకి పంపి, తానే ఎక్కువగా సిగ్గుపడిపోయింది. "ఏమిటే" అంటే, గోముగా, నాతో "మీకేం తెలీదు మీరూరుకోండి" అనేసింది. ఆ రాత్రి- వసారాలో నాకో నవారు మంచం కేటాయించింది. పుస్తకంలో మరో అధ్యాయానికి 'ఎత్తుగడ' సమకూరింది.

నా కూతురు రమ్య సంగతే చెప్తాను. ఆమెకి ఏ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌నో వరుడుగా తెద్దామనుకున్నాను. "మనవల్ల కాదు లెండి. ఈ సంబంధం మంచిదే. పిల్లవాడేదో రిసార్ట్సులో పనిచేస్తున్నాట్ట. అత్తా ఆడపడుచులూ లేరుట. మన రమ్యో పిచ్చిమొద్దు. దానికి పెద్ద పెద్ద ఆశలేం లేవులెండి. హాయిగా కాపురం చేసుకుంటుంది. ఈ సంబంధం ఖాయం." అన్నది పరిమళ. రమ్య పెళ్లయిపోయింది. నేను మార్జిన్ ఎక్కువైన పేజీలా ఉండిపోయాను. ఐదేళ్లలో ముగ్గురు పిల్లల్తో- అలిసిపోతూ, అనారోగ్యంతో సంసారం సినిమాలో నాయికయిపోయింది రమ్య.

కూతురు దిగులుతోనే- ఆకారాన్నీ, ఆరోగ్యాన్నీ చెడగొట్టుకుని తన పాత్రకి తానే ముగింపునిచ్చేసుకుంది పరిమళ. ఆ తర్వాత నా పాత్ర శిథిలమైన బొమ్మలా మారింది. నా పేజీ మరీ చివికి పోయింది, చిరిగిపోయింది.

భార్య చనిపోయిన మగాడికింక గుప్పెడు చింతలేగా మిగిలేవి. ఏ పంక్తికీ, ఏ పదానికీ, ఏ అక్షరానికీ విలువ లేకుండా పోయింది. పుస్తకం స్థానం కూసాల్లేని కుర్చీ అయిపోయింది. లేకపోతే కాళ్లు ముడుచుకోవాల్సిన కుక్కి మంచమయింది.

ఈ ప్రాణమేమన్నా తట్టెడా, పుట్టెడా? చక్కగా రంగుల, బొమ్మల పుస్తకంలో భద్రంగా ఉంటే ఎంత బాగుణ్ణు? - ఒక ఆశ. కానీ ఈ పుస్తకం ఎవరికీ అక్కర్లేదు గదా! అమ్మేయలేరు కనుక, మూలకి విసిరేసి ఉంచుతున్నారు. అంతేనా?! ఏమిటో- ఎందుకో- కంట తడి!

ఆకాశానికి మాసికలు వేస్తున్నట్టు, పలుకు భేదాల్తో, మాటల దిద్దుబాటుతో ఎన్నని చెప్పను?

"తాతయ్యా"అంటూ వచ్చాడు ప్రభాకర్. మనవడు వీడి చేతిరాత ముత్యాలకోవ. ఏం రాస్తాడో మాత్రం ఊహించలేము.

"చెప్పు" అన్నాను. పక్కన స్టూలుమీద కూర్చున్నాడు.

"రోజూ చెప్తూనే ఉన్నానుగా తాతయ్యా- నాకో ఎంపీత్రీ కొనిపెట్టు తాతయ్యా. నాన్ననడిగితే కస్సుమంటాడు. అది సరే గానీ, రేపో పార్టీ వుంది తాతయ్యా. అందరూ పంచుకోవాలా ఖర్చుని. మనం ఇవ్వమంటే బాగుండదు కదా. డీపీ అని హేళన చేస్తారు."

అంటే ఏమిటన్నట్టు చూస్తున్న నా చూపుని అర్థం చేసుకుని "అదే... ధర్మపిండం..." అని "ఒక్క వంద చాలు" అన్నాడు సౌమ్యంగా. "జిడ్డుగాళ్లు. అది కూడా లేదంటే వదలరు."

"అవునవును. నిజమే. కానీ, నా ఖర్చులకోసం ఉంచుకున్న డబ్బులు కూడా అయిపోయినైరా ఈసారి" అని చూపు మరల్చుకున్నాను. వాడి మొహంలో నిరుత్సాహం. అదోలా చూశాడు నావైపు.

"కొరగావుర పెమ్మయసింగధీమణీ- అని వో పద్యం చెప్తూ వుంటావు చూడు తాతయ్యా. ఆ లిస్ట్‌లో 'అడిగిన పైసా ఇవ్వని తాతల్ని కూడా కలపాలి."

లేచి, నిమ్మళంగానే వెళ్లిపోయాడు. గతుక్కుమన్నాను.

ప్రభాకర్ మాటలు చెంప పెట్టులా తగిలాయి. లేచి నుంచున్నాను. నిలబడలేక అంతలోనే మళ్లీ కూర్చుండి పోయాను.

గ్యాప్‌లు గ్యాప్‌లుగా పేజీల్లో పంక్తులు. ఎలైన్‌మెంట్ చెడిపోయి అచ్చయి బయటికొచ్చిన పేజీలా నా మొహం నాకే అసహ్యంగా వున్నట్లు భావన కలిగింది.

"బస్ ఛార్జీలక్కూడా అడ్డమైన వాళ్లనీ అడగటం, అడిగి లేదనిపించుకోవటం."

ఉషారాణి మాటలు వినిపించినై. తల్లితో జగడమాడుతోంది. మధ్యలో నా పేజీ మీద కసితో గీతలు పెడుతోంది. ఆ ప్రక్కగా ప్రభాకర్ తండ్రితో అంటున్నాడు, "నేనేమీ ఐ ఫోన్లూ, త్రీహండ్రెడ్ సీసీ మోటార్ బైకులూ అడగటంలేదు."

"చాల్లే సంబడం. అడుక్కు తినేవాడి దగ్గర గీరుకు తినే వాడన్నట్టుంది నీ వ్యవహారం" చంద్రం కసురుకుంటున్నాడు. తల్లీ కూతురూ కూడా వీళ్ల పక్కకే వచ్చారు.

రణగొణ ధ్వనీ, రాళ్లవానా.

చర్చ వేడెక్కింది. వాదనల్లో అగ్గి రగులుకుంది.

"నేను లోన్ ఇన్‌స్టాల్‌మెంట్ గురించి ఛస్తున్నాను. రేపే చివరి రోజు. కట్టకపోతే పెనాల్టీ రెండొందల యాభై, మళ్లీ వడ్డీ... తడిసి మోపెడవుతోంది. నా నెత్తినో బండ పెట్టి వినోదం చూస్తున్నాడు మీ తాత" చంద్రం అసహనపు స్వరం, అరుపులోకి చేరింది.

రంగుల, బొమ్మల పుస్తకంలో భద్రంగా ఉంటే ఎంత బాగుణ్ణు? - ఒక ఆశ. కానీ ఈ పుస్తకం ఎవరికీ అక్కర్లేదు గదా! అమ్మేయలేరు కనుక, మూలకి విసిరేసి ఉంచుతున్నారు. అంతేనా?! ఏమిటో- ఎందుకో- కంట తడి!

ఆ తర్వాత తుఫానూ, జోరూ, హోరూ...

నా అశక్తతకి ఇంత ప్రాధాన్యతా? అనిపించింది నాకు.

తప్పుల పట్టికల్ని మాత్రమే అచ్చొత్తుతున్న వైనం. అన్ని అభిమానాలూ హరించుకుపోయి, పేజీలమీద నల్ల సిరా దొర్లిస్తున్న వినోద ప్రదర్శనం!

కాస్సేపు అలా తిరిగొస్తే ప్రాణం హాయిగా ఉంటుందేమోనన్న ఆశ! మౌనంగా, పిచ్చిగా లేచి బయటికి బయల్దేరాను. అంతర్హితమైన ఒక నిట్టూర్పు వెలువడింది.

❁ ❁ ❁

చీకటి పడింది. పొద్దు పోయింది.

రాత్రి గడుస్తోంది.

ఇంటికి తిరిగొచ్చాను. ముందు గదిలో కుర్చీలో కూర్చున్నాను.

నవ్వు మొహంతో నీళ్ల గ్లాసందించింది వనజ. ఆమె మొహంకేసి తేరిపార చూశాను. ఏ భావమూ వ్యక్తం కాలేదు.

నీళ్లు త్రాగి, గ్లాసులు పక్కగా ఉంచాను.

"సాయంత్రంనుంచీ మా ఆందోళన ఆందోళన కాదు" "ఎక్కడికి వెళ్లారో ఏమో. ఆయన పక్కింటికి ఫోన్లూ. ఇప్పుడే వచ్చారు. బాత్‌రూమ్‌లోకెళ్లారు."

"ఏదో అట్లా పాత మిత్రుల ఇళ్లకి పోయొచ్చాను".

లోపల్నుంచీ ఉషారాణీ, ప్రభాకర్ వచ్చారు. "మమ్మల్నందర్నీ ఇట్టా సస్పెన్స్‌లో పెట్టి ఎటో వెళ్తే ఎట్టా తాతయ్యా"- ఉష.

"నాతో చెప్తే నేనూ వచ్చేవాణ్ణిగా తాతయ్యా"- ప్రభాకర్.

వాళ్లిద్దరి వైపూ చూసి సన్నగా నవ్వాను.

మాటల్లోనే వచ్చాడు చంద్రం. "హమ్మయ్య. వచ్చారా. చాలా ఆందోళన పడ్డాను."

ఏదో చెప్పటానికో, అడగటానికో ప్రయత్నం చేసి, ఏమీ అనకుండా వుండిపోయాను. వాళ్లు నలుగురూ ఏవో మాట్లాడుకుంటూ, నా గురించే చెప్పుకున్నారు.

నిముషాల తర్వాత చంద్రం అన్నాడు, "నా బాధ కొద్దీ మిమ్మల్ని ఏదేదో అన్నాను. అవన్నీ మనసులో పెట్టుకోకండి నాన్నా."

లోకంలో నేను ఒంటరిని కానన్న భావం మనసులో కదిలింది.

అనిర్వచనీయమైన తృప్తి గుండె నిండింది. పుస్తకంలో ఒకటి రెండు చదివించే పేజీలున్నాయన్నమాట- అనిపించింది. ఇంతలో ఇంత మార్పుకు కారణం? మేథలో వేనవేల ప్రశ్నలూ, ఆలోచనలూ..

ఏదో శోధనలో నిమగ్నమైపోయింది బుద్ధి.

ఘడియలన్నీ పండగ వాతావరణంలోకి మారేయి. రాత్రి టిఫిన్ అయింది. నలుగురి ఆప్యాయతా వచనలూ కలిసి నా రెండిడ్లీనీ మరింత రుచికరం చేశాయి. పుస్తకంలో కవితా పుట తెరచుకున్నదన్న భావన నా హృదయాన్ని ముప్పిరిగొన్నది.

- తీరిగ్గా అందరమూ హాల్లో చేరిన సమయం.

ఆలోచనాలోచనాలతో చెప్పసాగేడు చంద్రం. "ఇవ్వాళ ఎల్ఐసీ నుంచీ కాగితాలొచ్చినై నాన్నా. మీరేదో హోల్ లైఫ్ పాలసీ తీసుకున్నారట. వయస్సు ఎనభై ఏళ్లు రాగానే డబ్బు ఇచ్చేస్తారట."

ఆశ్చర్యంతో వాడికేసి చూశాను. నా స్పృహలో లేని వాస్తవం!

"అవును. లక్షాపాతిక వేలొస్తుందిట బోనస్‌లతో కలిపి." వాడి మొహంలోని వెలుగు మాటల వెలుతురు పూలు పూయిస్తోంది.

నా బతుకు పుస్తకంలో హఠాత్తుగా నా పాత్రకి మళ్లీ ప్రాధాన్యత వచ్చింది. ఏవేవో ఆలోచనలు, ఎన్నెన్నో భావాలు! పాత్ర ప్రాధాన్యతకీ, పేజీలోని అక్షరాల శక్తికీ కీలకాంశం మరింత స్పష్టంగా బోధపడింది.

ఏ నెల రోజుల తర్వాతో, ఈ పేజీ మారితే? ఒక ప్రశ్న. సన్నివేశం మారుతుంది. ఒక జవాబు! వేదాంతిలా నవ్వుకున్నాను!!

❁

రచయిత చిరునామా:
జె.ఎస్.మూర్తి
ఇం.నెం.16-11-310/12/ఏ/1/1,
గణపతి టెంపుల్ స్ట్రీట్,
సలీంనగర్ కాలనీ-2, మలకపేట,
హైదరాబాద్- 500 036.

★ కంటకారీ (నేలవాకుడు) స్వరసం రెండు భాగాలు, నెయ్యి (ఘృతము) ఒక భాగము గ్రహించి ఘృత పాక విధిగా సిద్ధంచేసి త్రాగిన అన్ని రకాలైన దగ్గులు తగ్గుతాయి.

ఇంటి వైద్యం